క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధారాణి

తిరుపతి అర్బన్ : కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సోమవారం గాలేరు నగరి సృజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని గిరిజన భవన్‌లో సోమవారం అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రుయా ఆస్పత్రి వైద్యుడు ముని మురళీధరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా 150 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల హక్కులు, వారికి అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఆర్టీసీ డీఎం బాలాజీ మాట్లాడుతూ దివ్యాంగులకు బస్సుల్లో పాస్ సేవలను తెలిపారు. కార్యక్రమలో ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తహసున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళంగా కంప్యూటర్లు



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ బాబ్జి

పాకాల : స్థానిక ఎస్‌వీఎన్ పాఠశాలకు రూ.25 వేల విలువైన కంప్యూటర్లను పూర్వ విద్యార్థి రాజేష్ విరాళంగా అందించారు. సోమవారం ఈ మేరకు ఎంఈఓ బాబ్జీ చేతుల మీదుగా కంప్యూటర్ తరగతిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న విద్యార్థులకు టెక్నాలజీ అవసరం ఉందని, ఇందుకోసం కంప్యూటర్లు తప్పనిసరిగా కావాలన్నారు. అయితే సాంకేతికతను మంచి మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, రాజేష్, చిట్టిబాబు, శ్రీధర్, రమేష్, మురళి, శ్రీలక్ష్మి, శ్రీదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్ కుసుమకుమారి, వైస్ చైర్మన్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

శాకాంబరిగా అగస్త్రీశ్వరుడు

చంద్రగిరి : తమిళ కార్తీక మాసం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తొండవాడ సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్రీశ్వర స్వామివారి ఆలయం, చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగస్త్రీశ్వరస్వామివారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కట్ట మీద గంగమ్మకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భాకరాపేట : మండలంలోని జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లె సమీపంలో ఉన్న కట్టమీద గంగమ్మ ఆలయంలో విగ్రహావిష్కరణ పూజలను సోమవారం ప్రారంభించారు. చినిగేపల్లి, మారసానివారిపల్లె, కురవపల్లె, దళితవాడ ప్రజల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పూజలు జరిపించనున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వంటశాల స్థలం కోసం వినతి

తిరుపతి అర్బన్ : రామసాయి మందిరం వంటశాలకు స్థలం ఇప్పించాలని శివజ్యోతి నగర్‌కు చెందిన ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 12 అంకణాల ప్రభుత్వ స్థలంలో వంటశాల నిర్మించాలని తలపెట్టగా, కొందరు ఆ స్థలం తమదంటూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. వెంటనే విచారణ చేపట్టాలని డీఆర్‌ఓ నరసింహులను ఆదేశించారు. కార్యక్రమంలో అక్కినపల్లె లక్ష్మయ్య, కొత్తపల్లి మునిరత్నం, విజయ కుమార్ , శ్రీధర్, రమేష్, గోవిందరాజులు, లోకనాధం పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

తిరుపతి రూరల్ : మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం 18వ సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు వివిధ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై ఇటీవల వరకు సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. వీటిపై మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజావేదికను చేపట్టనున్నట్లు వివరించారు.

నాడు.. దేదీప్యం



నేడు.. దయనీయం



వెలుగునీడలు

నగరంలోని ప్రకాశం పార్కుకు ఐ లవ్ తిరుపతి బోర్డు ప్రధాన ఆకర్షణగా నిలిచేది. వెలుగులు విరజిమ్ముతూ యువతను కట్టిపడేసేది. సెల్ఫీలు తీసుకునేందుకు ఫొటోస్పాట్‌గా విలసిల్లేది. అయితే పర్యవేక్షణలోపంతో ఈ బోర్డును చీకటి కమ్మేసింది. లైట్లు సక్రమంగా వెలగకపోవడంపై సందర్శకుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఐ లవ్ తిరుపతికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- తిరుపతి తుడా

ఆగడాలు.. ఆక్రమణలు

నిరుపేదలనే కనికరం కూడా లేకుండా టీడీపీ నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. పాకాలలో పొట్టకూటి కోసం పాట్లు పడుతున్న చిరువ్యాపారులపై దౌర్జన్యం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి నిరంకుశంగా వారి దుకాణాలను తొలగించేశారు. పంచాయతీకి సక్రమంగా పన్ను చెల్లిస్తున్నా బేఖాతర్ చేస్తూ కక్షసాధింపులకు దిగుతున్నారు. పచ్చమూక ఆదేశాలకు జీ హుజూర్ అంటూ అధికారులు సైతం వంత పాడుతున్నారు. ఇదే క్రమంలో కబ్జాకోరులకు సైతం పూర్తిగా సహకరిస్తున్నారు. కాలువ గట్టుపై అక్రమ నిర్మాణాలు చేపట్టినా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగులపై మాత్రం తమ ప్రతాపం చూపిస్తున్నారు.

- అధికారుల అండతో టీడీపీ నేతల అక్రమాలు
- ఒక వైపు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి పేదలపై కక్ష సాధింపు
- నిరంకుశంగా దుకాణాల తొలగింపు
- మరో వైపు యథేచ్ఛగా కబ్జాలకు బరితెగింపు

మైనారిటీలు నిర్వహిస్తున్న దుకాణాలు (ఫైల్)



తిరుపతి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలు, కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పచ్చ నేతల ఆదేశాలను అధికారులు శిరసావహిస్తున్నారు. అందులో భాగంగా పాకాల ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు సమీపంలో మైనారిటీలు నిర్వహిస్తున్న టీ స్టాల్, బిరియానీ సెంటర్‌ను తొలగించారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు అని నిర్మొహమాటంగా ముద్ర వేసేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సాకు చూపించారు. సుమారు 15 ఏళ్లుగా పంచాయతీకి రోజువారీ పన్ను కడుతున్నామని వివరించినా పట్టించుకోలేదు. కేవలం రాజకీయ వేధింపుల్లో భాగంగా వారి పొట్టకొట్టేశారు. జీవనోపాధి లేకుండా చేసేశారు.

హడలిపోతున్న జనం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వేచ్ఛగా తిరిగే వెసులుబాటు కూడా లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఆగడాలకు హడలిపోతున్నామని వెల్లడిస్తున్నారు. పోలీసులు సైతం టీడీపీ నేతల ఒత్తిడిని భరించలేక అసహనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారని వివరిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



షాపులను తొలగించిన దృశ్యం

టీడీపీ నేత కబ్జా చేసిన కాలువ గట్టు



కాలువ గట్టుపై అక్రమ నిర్మాణం

పాకాల కూరగాయల దినసరి మార్కెట్ పక్కనే ఉన్న పెద్ద కాలువను ఓ టీడీపీ నేత కబ్జా చేశాడు. కాలువపైన కాంక్రీట్ వేసి రేకులతో షెడ్డు కూడా నిర్మించాడు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాంలో అక్రమ నిర్మాణం చేపట్టినా అధికారులకు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్ : తిరుపతి నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సప్తగిరి నగర్, శాంతినగర్, ప్రశాంతి నగర్‌లో కరెంట్ ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి జర్నలిస్టుల మహాసభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జాప్ నేతలు

తిరుపతి కల్చరల్ : విజయవాడలో ఈనెల 11,12 తేదీలలో జర్నలిస్టుల జాతీయ మహాసభ నిర్వహించనున్నట్లు జాప్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఎన్‌యూజేకి అనుబంధంగా జాప్ పని చేస్తోందని పేర్కొన్నారు. 11న ఉదయం 10 గంటలకు విజయవాడ క్లబ్‌లో ప్రారంభమయ్యే సమావేశాలకు మంత్రులు హాజరవుతారని వెల్లడించారు. పెద్దసంఖ్యలో జర్నలిస్టులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాప్ నేతలు విజయ్ యాదవ్, రాజు పాల్గొన్నారు.

15న 'కరుణీగర్' సమావేశం



మాట్లాడుతున్న సీతాపతి పిళ్లై

తిరుపతి కల్చరల్ : కేటీ రోడ్డులోని ఎన్‌జీఓ ఫంక్షన్ హాల్లో ఈనెల 15వ తేదీన ఉదయం 9 గంటలకు తిరుపతి కరుణీగర్ అభ్యుదయ సంఘం 25వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎస్. సీతాపతి పిళ్లై తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కర్ణం కులస్తుల సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే కర్ణం కులస్తులకు వివాహ పరిచయ వేదికతో పాటు వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కర్ణం సామాజిక వర్గం విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9849507843 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సంఘం కార్యదర్శి సి.రమణన్, కోశాధికారి పీఆర్ రవిశంకర్, ఉప కార్యదర్శి చంద్రశేఖర్, ప్రొఫెసర్ వి.శ్రీధర్ పాల్గొన్నారు.


సత్వరమే సమస్యల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రజలు అందించిన వినతులను పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 34 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ వెల్లడించారు. గొల్లవానిగుంట, శ్రీనివాసపురంలో డ్రైనేజీలు నిర్మించాలని, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని, టౌన్ బ్యాంక్ సమీపంలో తాగుబోతుల సమస్య అరికట్టాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని తదితర సమస్యలపై వినతులు సమర్పించారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన



మహిళలను పరీక్షిస్తున్న వైద్య బృందం

తిరుపతి కల్చరల్ : క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకుంటే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వ్యాధిని నిర్మూలించవచ్చని మెటర్నిటీ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్య తెలిపారు. సోమవారం తిరుచానూరు రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ల సలహాలు పాటించి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హెపటైటిస్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది నాగేశ్వర్‌రావు, మునిరాజ, సువర్ణ రేఖ, భారతి, లలిత, కుచేంద్ర, కుమారి, శారద, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టోర్నీకి ఎస్పీడబ్ల్యూ విద్యార్థినులు



సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థినులు

తిరుపతి సిటీ: కేరళ రాష్ట్రం, కొట్టాయం వేదికగా ఈనెల 20 నుంచి జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళా బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు పద్మావతి డీగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీకాం, బీఎస్సీ చదువుతున్న ఎల్.హర్షిత, పీ.స్వాతీ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. అలాగే ఈనెల 27వ తేదీ నుంచి కాలికట్‌లో జరగనున్న సౌత్‌జోన్ ఖోఖో మహిళల ఇంటర్‌యూనివర్సిటీ టోర్నమెంట్‌కు బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న గౌరీప్రియ, బీ.నందిని, ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీ.హరిప్రియ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జీ.భద్రమణి, డాక్టర్ భారతి, ప్రవల్లిక అభినందనలు తెలిపారు.

దుర్గగుడికి రూ.3.15 లక్షల విరాళం



దాతకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయాధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, గుడి బంగారు తాపడం పనులకు తిరుపతికి చెందిన భక్తులు సోమవారం రూ.3.15 లక్షల విరాళం అందజేశారు. నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన ఎం.సుబ్రమణ్యంరెడ్డి, కుసుమాంబ కుటుంబ సభ్యులు నిత్యాన్నదానానికి రూ.1.15 లక్షలు, బంగారు తాపడం పనులకు రూ.2 లక్షల చొప్పున సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందించారు.

ఎస్వీయూ అధ్యాపకుల ప్రతిభ



ప్రతిభ చూపిన అధ్యాపకులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ క్యాంపస్‌లో జరిగిన అధ్యాపకుల టెన్నిస్ టోర్నమెంట్‌లో వర్సిటీ అధ్యాపకులు సింగిల్స్, డబుల్స్ విభాగాలలో ప్రతిభ చాటారు. సిగిల్స్ విభాగంలో ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి టాపర్‌గా నిలువగా, ద్వితీయ స్థానంలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు భాస్కర్‌రాజు నిలిచారు. అలాగే డబుల్స్‌లో ఎస్వీయూ ప్రొఫెసర్లు ఎం.శివశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వరదరాజన్, డాక్టర్ ఎస్ గఫూర్ నిలిచారు. గెలుపొందిన అధ్యాపకులకు ప్రముఖ రేడియాలజిస్ట్, ఫుట్‌బాల్ ప్లేయర్ డాక్టర్ నజీరుద్దీన్, మాజీ ఎస్వీయూ వీసీ మెంబర్ హనుమంతరావు జ్ఞాపికలను అందజేశారు.

అన్నమయ్య బాట అభివృద్ధే లక్ష్యం



తిరుమలకు వెళుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి

తిరుమల: తిరుమల శ్రీవారిపై వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య నడిచిన కాలిబాట అభివృద్ధే లక్ష్యమని, ఇందుకోసమే 22వ పర్యాయం పాదయాత్ర చేపట్టినట్లు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. సోమవారం రాజంపేట నుంచి వేలాది మందితో కలిసి మహా పాదయాత్రగా తిరుమలకు చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు 500 ఏళ్ల క్రితం అన్నమయ్య ఈ మార్గం ద్వారా శ్రీవారి సన్నిధికి చేరినట్లు వెల్లడించారు. అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈమార్గం అభివృద్ధికి బాటలు వేసారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ బోర్డులో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అన్నమయ్య బాటను అభివృద్ధి చేయాలని ఆకాక్షిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రామచరితే విశ్వానికి ఆదర్శం



ప్రవచనం చేస్తున్న గరికపాటి రమేష్‌బాబు

తిరుపతి కల్చరల్ : శ్రీరాముని జీవితమే విశ్వానికి ఆదర్శమని ప్రవచన కర్త గరికపాటి రమేష్‌బాబు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య కళామందిరంలో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ప్రవచన కర్త మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలోని కిష్కిందకాండను విసొంపైన పద్యాలతో వివరించారు. అనంతరం ప్రవచనకర్తను రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

మఠం భూమిలో హఠం!

- అక్రమ కట్టడాలంటూ అర్ధరాత్రి కూల్చివేత
- సమీపంలోని నిర్మాణాలను పట్టించుకోని అధికారులు
- టీడీపీ కీలక నేత ఆదేశాలతోనే హడావుడి



మఠం భూమిలో కూల్చేసిన కట్టడాలు

చంద్రగిరి : అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే రెవెన్యూ యంత్రాంగం నడుస్తోంది. వారి ఆదేశాల మేరకే అడుగులు వేస్తోంది. ఇందుకు నిదర్శనంగా ఆదివారం అర్ధరాత్రి అధికారులు చేసిన హడావుడే కనిపిస్తుంది. వివరాలు.. తిరుచానూరు నుంచి ముళ్లపూడి వెళ్లే మార్గంలో సర్వే నంబరు 479లో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో స్థానిక రైతులు వ్యవసాయం చేసుకునేవారు. ఏడాది క్రితం అహోబిలం మఠం నిర్వాహకులు అక్కడకు వచ్చి పాఠశాల నిర్మాణానికి రైతులతో మాట్లాడి తీసుకున్నారు. అప్పట్లోనే ప్రహరీతో పాటు చిన్నపాటి ఇంటిని నిర్మించారు.

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో, టీడీపీకి చెందిన ఓ నేత కన్ను అహోబిలం మఠం భూమిపై పడింది. ముందుగా నకిలీ పత్రాలతో బెదిరింపులకు దిగారు. అడ్డుకున్న మఠం నిర్వాహకులనే కబ్జాదారులుగా సృష్టించి రెవెన్యూ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీలోని ఓ కీలకనేత ఆదేశాలతో రెండేళ్ల క్రితం నిర్మించిన నిర్మాణాలను తాజాగా నిర్మిస్తున్నారంటూ హడావుడి చేశారు. అర్ధరాత్రి సమయంలో జేసీబీతో నిర్మాణాలను కూల్చివేశారు. అయితే అక్కడే టీడీపీ నేత నిర్మించిన ప్రహరీ గోడ ఉంది. పక్కనే పైపుల ఫ్యాక్టరీ ఉంది. వాటిని వదిలేసి మఠం భూమిలోని నిర్మాణాలనే కూల్చివేయడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ నేత నిర్మించిన ప్రహరీ గోడ

నోటీసులు ఇచ్చే కూల్చివేశాం

సర్వే నంబరు 479లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, అక్రమంగా నిర్మాణాలకు పూనుకున్నారు. దీనిపై ఫిర్యాదు రావడంతో, అహోబిలం మఠం నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. స్పందించకపోవడంతో కూల్చివేశాం. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టాం. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదు.

\- రామాంజులునాయక్, తహసీల్దార్, తిరుపతి రూరల్